నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

శాలిబండ: విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. జన ప్రియ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, ఏజీ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో ఉంటుందన్నారు.

ఫలక్‌నుమా పరిధిలో..

విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీహెచ్ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

సీఎంను కలిసిన కురాకుల కృష్ణ



గోల్కొండ: తెలంగాణలో ఎరుకల కులస్తుల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా గురువారం బాపుఘట్‌కు వచ్చిన సీఎంను తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘ్ ప్రధాన కార్యదర్శి కురాకుల కృష్ణ కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు.

నిషేధిత సిగరేట్ల విక్రేత రిమాండ్



సంతోష్‌నగర్: నిషేధిత సిగరేట్లను విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఐ.ఎస్.సదన్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఐ.ఎస్.సదన్ ఖలందర్‌నగర్ ప్రాంతానికి చెందిన తరీఫ్ హుస్సేన్ (30) ఐజాజ్ వద్ద నిషేధిత సిగరేట్లను తక్కువ ధరలకు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. తరీఫ్ హుస్సేన్ గురువారం వాహియాన్ మసీదు సమీపంలో విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. అతని వద్ద నుంచి రూ.40 వేల విలువ చేసే వివిధ రకాల సిగరేట్లు, హోండా యాక్టివా వాహనం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

'స్పీడ్ బ్రేకర్లు వేయించండి'

మణికొండ: నార్సింగి నుంచి మణికొండకు వచ్చే ప్రధాన రోడ్డుపై పుప్పాలగూడ సంతోష్ నగర్ కాలనీ ప్రవేశంలో స్పీడ్ బ్రేకర్‌లు లేక రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయని, మున్సిపాలిటీ వారికి చెప్పి వెంటనే వేయించాలని నార్సింగి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులును కాలనీకి చెందిన సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. శుక్రవారం ఆయనకు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.సురేందర్ మాట్లాడుతూ ప్రధాన రోడ్డుపైకి కాలనీలో నుంచి వచ్చే వారు అకస్మాత్తుగా వస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇదే విషయాన్ని మున్సిపల్ కమీషనర్‌ను కలిసి తెలిపితే నార్సింగి ట్రాఫిక్ పోలీసులు సూచించిన చోటనే స్పీడ్ బ్రేకర్‌లను వేస్తున్నామన్నారు. అందుకు ట్రాఫిక్ పోలీసులు మున్సిపాలిటీకి లేఖ రాయాలని కోరామన్నారు. ప్రధాన కార్యదర్శి ఆర్.సురేందర్, కోశాధికారి ఎస్.రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నామని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డివిజన్ అధ్యక్షుడు పాండుయాదవ్‌నాయకులతో కలిసి శుక్రవారం ఆయనను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... నిత్యం ఎల్లప్పుడూ ప్రజల సేవలో ముందుంటూ ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. నేతలు శ్రీకాంత్‌రెడ్డి, తలారి చిన్న, మన్మోహన్‌రెడ్డి, భూషణ్, రామ కృష్ణ, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజయ దశమి వేడుకల్లో కోలాటం ఆడుతున్న మాజీ ఎంపీ వి.హనుమంతరావు, అప్సర్ యూసుఫ్ జాహీ



గుడిమల్కాపూర్‌లో



రావణ దహన కార్యక్రమంలో పాల్గొన్న ఆలే జితేంద్ర

చెడుపై విజయమే విజయదశమి

సందడిగా దసరా వేడుకలు

పాల్గొన్న ప్రజాప్రతినిధులు

చార్మినార్: చెడుపై విజయమే విజయ దశమి వేడుకలని తెలంగాణ రాష్ట్ర జీఎస్‌టీ ట్రిబునల్ కోర్టు జడ్జి భాస్కర్‌రెడ్డి వేమిరెడ్డి అన్నారు. హిందూ సంరక్షణ్ సమితి అధ్యక్షులు పంకజ్‌కుమార్ అగర్వాల్ ఆధ్వర్యంలో కుడా స్టేడియంలో ఏర్పాటు చేసిన రావణ దహనం కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉత్సవాలను కలిసి మెలిసి నిర్వహించుకోవడం శాంతి సామరస్యానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో కమలేష్ రతివాల్,మొఘరాణి అగర్వాల్ పాల్గొన్నారు.

ఆర్య మైదాన్‌లో రావణ దహనం

గౌలిపురా: నాగులచింత ఆర్య మైదాన్‌లో గురువారం రాత్రి రావణ దహన కార్యక్రమం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, ఛత్రినాక ఏసీపీ సిహెచ్.చంద్రశేఖర్, అర్జున్ ఆర్య, సుమన్ కుమార్ ముదిరాజ్, ప్రసాద్, ఉదయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

గోల్కొండ కోటలో..

గోల్కొండ: హిందూ సేవా సమాజ్ ఆధ్వర్యంలో గోల్కొండ కోటలో జరిగిన వేడుకల్లో దాండియా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇక్కడ జరిగిన రావాణ దహన కార్యక్రమం స్థానికంగా ఎంతగానో ఆకట్టుకుంది. అదే విధంగా షేక్‌పేట్‌లో వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో పూజలు, రావణ దహన కార్యక్రమాలు అత్యంత ఘనంగా జరిగాయి.



జియాగూడ ధార్మిక్ ఉత్సవ్ విజయదశమి వేడుకల్లో పాల్గొన్న శివకుమార్ యాదవ్



శివాజీ వేషధారుడిని సన్మానిస్తున్న మిత్రకృష్ణ, ముఖేష్ సింగ్



రావణ దహనం కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తి భాస్కర్‌రెడ్డి వేమిరెడ్డి



ఉత్సవాల్లో పాల్గొన్న గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మీ



విజయ దశమి వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు ఫిరోజ్‌ఖాన్, బి.సాయిబాబాచారి

సత్కారం



చార్మినార్: మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర దేవాలయం పూజారి పురుషోత్తం కులకర్ణి వేదాంత జ్యోతిష్యంలో డాక్టరేట్ సాధించారు. దేవాలయం కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కాశీ హిందీ విశ్వవిద్యాలయం నుంచి ఆయన వేదాంత జ్యోతిష్యంలో పీహెచ్‌డీ చేశారు.

భక్తులకు చీరల పంపిణీ

చార్మినార్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర దేవాలయంలో ప్రతి రోజు సాయంత్రం జరిగిన సామూహిక కుంకుమార్చన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మహిళా భక్తులకు శుక్రవారం దేవాలయం కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య అమ్మవారి చీరలను పంపిణీ చేశారు. గత నెల 22వ తేదీన ప్రారంభమైన ఉత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. ఈ కార్యక్రమంలో గాజుల అనంతయ్య,కాట రమేష్ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్న ప్రధాని మోదీ

గౌలిపురా: ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాల సందర్భంగా భారత ప్రధాని నరేంద్రమోదీ పోస్టేజ్ స్టాంపు, 100 రూపాయల నాణాన్ని విడుదల చేయడం భారత రాజ్యాంగాన్ని అవహేళన చేయడమేనని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు గడ్డమీది చంద్రమోహన్ గౌడ్ ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ ఈ దేశం కోసం ఏం ఘన కార్యం చేసిందని ఈ సందర్భంగా వంద రూపాయల నాణాన్ని విడుదల చేస్తున్నారని విమర్శించారు. బ్రిటిష్ పాలకులకు వత్తాసు పలుకుతూ మూడు అనే సంఖ్యను నమ్మని ఈ సంస్థ మన మూడు రంగుల జెండాను జాతీయ జెండగా గుర్తించని ఆర్ఎస్ఎస్ ఏ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిందని ఆర్ఎస్ఎస్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ రెండు విడుదల చేయడం బీజేపీ చేస్తున్న తప్పులను సరిదిద్దడానికి దేశ ప్రజల ఆలోచనలను దారి మళ్లించడానికి అని దుయ్యబట్టారు. ఇలా చేయడం అధికారాన్ని అడ్డుపెట్టుకొని నియంతృత్వ పాలన చేయడమే అని వ్యాఖ్యానించారు. అధికారాన్ని దుర్వినియోగం చేయడం తప్పా దేశ ప్రజల ప్రయోజనానికి అక్కరకు వచ్చేది ఏమి లేదన్నారు.

పర్యాటకులతో మర్యాదగా వ్యవహరించాలి

- క్యాబ్ డ్రైవర్లు నిబంధనలు తప్పకుండా పాటించాలి
- ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పీఎస్ ఇన్‌స్పెక్టర్ కనకయ్య



క్యాబ్ డ్రైవర్లకు సూచనలిస్తున్న ఇన్‌స్పెక్టర్ కనకయ్య

శంషాబాద్: ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా ప్రతి డ్రైవరూ నిబంధనలు తప్పకుండా పాటించాలని ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కనకయ్య సూచించారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఓలా, ఊబర్, ర్యాపిడో యాప్ ఆధారిత క్యాబ్ డ్రైవర్లతో ఎయిర్‌పోర్టులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... డ్రైవర్లు వాహన పనితీరును పరిశీలించుకోవాలన్నారు. ప్రయాణికులతో దురుసుగా వ్యవహరించడం వంటి అవాంఛిత కార్యకలాపాలకు పాల్పడరాదన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులను మన అతిథులుగా భావించి వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారికి చట్టపరమైన శిక్షలు తప్పవన్నారు. ప్రతి డ్రైవరు కూడా సాంకేతిక అవగాహనను పెంచుకోవాలని సూచించారు. అజ్ఞాత లింకులను ఓపెన్ చేయకూడదన్నారు.

వరల్డ్ వైల్డ్ లైఫ్ వారోత్సవాలు షురూ

బహదూర్ పురా: నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో 71 వరల్డ్ వైల్డ్ లైఫ్ వారోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల రెండు నుంచి ప్రారంభమైన ఈ వేడుకలలో మొదటి రోజు సందర్శనకు వచ్చిన చిన్నారులతో డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఐదు వందల మంది చిన్నారులకు జంతువులు వాటి సహజసిద్ధమైన నివాసాలపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. రెండవ రోజు 3000 మంది సందర్శకులకు సరిసృపాల హౌస్, యంపీ థియేటర్లలో పాములపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు.ఈ నెల 4వ తేదీ ప్లాంటేషన్ డ్రైవ్, యానిమల్ కీపర్స్ టాక్ షో, 5వ తేదీ ఏనుగుల ఆహారం నిపుణులతో ప్రత్యేక చర్చ నిర్వహించబడుతుంది. 6న జూ డే వేడుకలు. 7న వైల్డ్ లైఫ్ యోగా సెషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు, 8న జూ వైల్డ్ లైఫ్, ఉద్యోగులు, సందర్శకులతో జూ లో వన్యప్రాణి పరేడ్ కార్యక్రమాలు ఉంటాయి. నెహ్రూ జూలాజికల్ పార్క్ ఉద్యోగుల కోసం క్రికెట్, బాడ్మింటన్, తదితర కార్య క్రమాలను నిర్వహించనున్నట్లు డిప్యూటీ క్యూరేటర్ బర్నోబా తెలిపారు.

గుర్తు తెలియని మహిళా మృతదేహం లభ్యం

డబీర్‌పురా: గుర్తు తెలియని మహిళా మృతదేహం లభ్యమైన ఘటన మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సాలార్‌జంగ్ మ్యూజియం రోడ్డు వద్ద ఈ నెల 1న గుర్తు తెలియని మహిళా (30) మృతదేహం పడిఉన్నట్లు మ్యూజియం సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

మద్యం విక్రేత రిమాండ్

డబీర్‌పురా: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన ఘటన మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పి.నర్సింగ్ రావు (62) వివిధ కంపెనీలకు చెందిన 57.2 లీటర్ల 318 మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి అధిక డబ్బులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. గాంధీ జయంతి సందర్భంగా వైన్స్ బంద్ ఉండటంతో అక్రమంగా ఎలాంటి లైసెన్స్ లేకుండా మద్యాన్ని విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు మీర్‌చౌక్ పోలీసులతో కలిసి దాడులు చేసి మద్యం స్వాధీనం చేసుకుని నర్సింగ్ రావును రిమాండ్‌కు తరలించారు.

కథల ఆవశ్యకతపై చిన్నారులకు అవగాహన



బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ పరిధిలోని మురారి గృహ సముదాయంలోని పిల్లలో పుస్తక పఠనం పెంపొందించడంలో కథలు చెప్పడం అనే ఉద్దేశంతో దసరా పండుగ రోజులలో వారం రోజులు కథలు చదవడం, చెప్పడం మీద అక్కడి పిల్లలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. రోజూ పిల్లలు గృహ సముదాయంలోని గ్రంథాలయంలో పుస్తకాలు చదివి, కథలు చెప్పటం చేశారు. పెద్దలు కూడా కథలు చెప్పి వారిని అలరించారు. చివరి రోజు ప్రముఖ చందమామ కథల రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ దాసరి వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొని పిల్లలతో కథలు చెప్పించి వారు కూడా కథలు చెప్పారు. కథల ప్రాముఖ్యం వివరిస్తూ తల్లిదండ్రులు పిల్లలకు రోజుకు ఒక కథ చెప్పినా అది వారి వ్యక్తిత్వం వికాసానికి ఎంతో దోహదపడుతుందన్నారు. అక్కిరాజు శ్రీహరి, చైతన్య, ప్రియాంక పాల్గొన్నారు.

దేశానికి దిక్సూచి అలయ్ బలయ్



దత్తాత్రేయకు గొర్రెపిల్లను బహూకరిస్తున్న నాయకులు

గన్‌ఫౌండ్రీ: గత 20 సంవత్సరాలుగా పార్టీలకు అతీతంగా నిర్వహిస్తున్న అలయ్-బలయ్ కార్యక్రమం దేశానికి దిక్సూచిగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు. బండారు దత్తాత్రేయ, బండారు విజయలక్ష్మీ ఆధ్వర్యంలో శుక్రవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించిన అలయ్-బలయ్ సమ్మేళనంలో రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు యెగ్గె మల్లేశం, నాయకులు క్యామ మల్లేశం, గడ్డం శ్రీనివాస్ యాదవ్ దత్తత్రేయకు గొంగళి, గొర్రెపిల్లను బహూకరించి సత్కరించారు.

అవార్డు ప్రదానం



అవార్డును అందుకుంటున్న హరినారాయణరెడ్డి

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ సామాజిక వేత్త డాక్టర్ కొండూరు హరినారాయణరెడ్డికి ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అవార్డును శుక్రవారం అందజేశారు. గత 48 సంవత్సరాలుగా సమాజంలో వెనుకబడిన, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన 6 వేల మందికి ఉచిత వివాహాలు, దేవాలయాలలో అన్నదానం, నిరుపేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలకు హరినారాయణరెడ్డికి ఈ అవార్డును అందజేస్తున్నట్లు వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ చీఫ్ కో ఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్ తెలిపారు. ఈ అవార్డు తనపై ఎంతో బాధ్యతను పెంచిందని, రాబోయే రోజుల్లో మరింత ఉత్సాహంగా సేవా కార్యక్రమాలు చేస్తానని హరినారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుసుమ బోగరాజు తదితరులు పాల్గొన్నారు.

కున్ యునైటెడ్ హ్యుందాయ్‌లో దసరా వేడుకలు



సాక్షి, సిటీబ్యూరో: దేశంలో హ్యుందాయ్ అతిపెద్ద డీలర్ కున్ యునైటెడ్ హ్యుందాయ్ విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించింది. గురువారం షేక్‌పేటలోని షోరూమ్‌లో 'దసరా డెలివరీ డిలైట్' ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా వందలాది కస్టమర్లు కొత్త హ్యుందాయ్ కార్లను తీసుకున్నారు. నెయిల్ ఆర్ట్, సెల్ఫ్ క్యారికేచర్ సెషన్స్, మ్యాజిక్ షో, త్రీడీ ఫొటోగ్రఫీ వంటి ప్రదర్శనలతో కస్టమర్లు ఆనందంగా గడిపారని కున్ యునైటెడ్ హ్యుందాయ్ సీఈఓ అశోక్ రాజగోపాలన్ తెలిపారు.

లాల్ బహదూర్ శాస్త్రికి నివాళి

గౌలిపురా: బీజేపీ గౌలిపురా డివిజన్ అధ్యక్షులు సుమన్ కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేటితరం యువత లాల్ బహదూర్ శాస్త్రి జీవిత చరిత్రను తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రూప్ రాజ్, వెంకటేష్, యాదగిరి, అల్లి మధుసూదన్ గిరి, మల్లేష్, మహేంద్రగిరి, శైలేందర్ రెడ్డి, సాకేత్, రవి, సాయి కుమార్, సిహెచ్.నర్సింగ్ రావు పాల్గొన్నారు.



మహాత్ముడికి ఘన నివాళి



గోల్కొండ: గాంధీ జయంతి సందర్భంగా గురువారం లంగర్‌హౌస్‌లోని బాపుఘట్‌లో కాంగ్రెస్ నాయకులు గాంధీజీ విగ్రహానికి పూలమలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ హనుమంతరావు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు అప్సర్ యూసుఫ్ జాహి, రాష్ట్ర ఎరుకల సంఘ ప్రధాన కార్యదర్శి కురాకుల కృష్ణ, ఏ.చంటిబాబు, పరమానందం పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ నాయకులు ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన టోలిచౌకి మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో నానల్‌నగర్, టోలిచౌకి, లంగర్ హౌస్ తదితర డివిజన్‌లకు చెందిన మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులతో సమావేశమై మాట్లాడారు. తమతమ ప్రాంతాలలోని సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరూన్ ఫరాన్, అబ్బాస్ హుస్సేన్, తదితరులున్నారు.

దసరా కానుకగా జీఎస్‌టీ తగ్గింపు



మాట్లాడుతున్న ఎంపీ లక్ష్మణ్

గోల్కొండ: జీఎస్‌టీ తగ్గింపు ప్రధాని నరేంద్రమోదీ ప్రజలకు ఇచ్చిన పండుగ కానుక అని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం గోల్కొండ కోటలో జరిగిన దసరా సమ్మేళన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశీయ ఉత్పత్తులనే కొనాలని దీన్ని వల్ల దేశీయ వస్తువులను ఉత్పత్తి చేసే కంపెనీలకు ప్రోత్సాహం లభించినట్లు ఉంటుందన్నారు. విదేశీ వస్తువుల ధరలతో పోలిస్తే దేశీయంగా తయారైన వస్తువుల ధరలు తక్కువగా ఉంటాయన్నారు. ప్రధాని ఎప్పుడు కూడా దేశీయ ఉత్పత్తులకే ప్రాధాన్యం ఇవ్వాలని ప్రజలను కోరారన్నారు. నరేంద్రమోదీ ఆధ్వర్యంలో నేడు దేశీయ పరిశ్రమలు ఎంతో ముందంజలో ఉన్నాయన్నారు.

స్వదేశీ ఉద్యమంతోనే ప్రపంచ దేశాలకు గుణపాఠం

లంగర్‌హౌస్: ప్రధాని మోదీ చెప్పిన విధంగా స్వదేశీ నిశ్చయాన్ని భాద్యతాయుతంగా, ఒక ఉద్యమంలా పాటిస్తే అమెరికాలాంటి దేశాలకు బుద్ది చెప్పడంతో పాటు మన దేశాన్ని మరింత గొప్పగా అభివృద్ధి చేసుకోవచ్చని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. లంగర్‌హౌస్ రాంలీలా మైదానంలో జరిగిన దసరా వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. దసరా ఉత్సవ సమితి అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాలు ఆకట్టుకున్నాయి. 15 రోజులుగా నిర్వహించిన సాంస్కృతిక, క్రీడా పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందజేశారు.ఈ వేడుకల్లో లింగం శ్రీధర్, పొంగులేటి సుధాకర్, రాపోలు ఆనంద భాస్కర్, బద్దం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.